

భీమవరంలో బస్టాండ్.. మెయిన్ రోడ్‌లో రద్దీ

రారండోయ్.. పండుగ చేద్దాం

వరుస సెలవులు.. పశ్చిమలో సంక్రాంతి సందడి



అతిథి గృహాలకు డిమాండ్



ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి వచ్చే పర్యాటకులు, బంధువులు ఉండేందుకు అన్ని సౌకర్యాలతో ఉండే వసతి గదులకు డిమాండ్ ఏర్పడింది. గతంలో రోజుకు అద్దెకు దొరికే ఈ గదులు.. ఇప్పుడు మూడు రోజులైతేనే ఇస్తామని చెబుతున్నారు. లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అపార్ట్‌మెంట్, ఫంక్షన్ హాల్‌లోని గదులు, విడిదిల్లు ఏదీ ఖాళీలేదు. ధరలు కూడా రెట్టింపు చేశారు. ఒక్క భీమవరంలోనే లాడ్జిలు, ఇతర అద్దెకు ఇచ్చే భవనాలు రెండు వందలకుపైగా అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ సింగిల్ ఏసీ బెడ్ రూమ్ మొన్నటి వరకు రూ.1500 నుంచి 2 వేలు. ఇప్పుడు రూ.3 వేల నుంచి నాలుగు వేలకు మారింది. డబుల్ బెడ్‌రూమ్‌లు మూడు నుంచి ఆరు వేలకు వెళ్లింది. మూడు రోజులకు రూ. 15 వేలుగా తీసుకుంటున్నారు. దీంతో సంక్రాంతి డబుల్ ధరలు మూడు రోజుల ప్యాకేజీగా మారాయి. గ్రామాల్లోను ఫంక్షన్ హాల్‌లో ఉండే గదులను అద్దెకు ఇచ్చేస్తున్నారు. రూమ్‌కి రూ.3 వేలు ధర పెట్టారు. ఎన్‌ఆర్‌ఐ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగస్తులు డబ్బును లెక్క చేయకుండా రూమ్ దొరికితే చాలన్నట్లు ఉన్నారు.

గడచిన ఐదేళ్లతో పోలిస్తే ఈసారి పల్లె, పట్నం తేడా లేకుండా పండుగ వాతావరణం నెలకొంది. గతంలో రాజకీయం వేడెక్కి ఉండడం, ప్రతీది వివాదాస్పదం అయ్యేది. సామాజిక వర్గాల వారీగా టార్గెట్‌లు చేసేవారు. కూటమి ప్రభుత్వం రాకతో ఒక్కసారిగా స్వేచ్ఛ లభించినట్టు అన్ని వర్గాలు పండుగ సంబరాలకు సంసిద్ధమయ్యాయి. విదేశాల నుంచీ అనేక మంది సొంతూళ్లకు వస్తున్నారు.

- హైదరాబాద్ నుంచి భారీగా తరలి వస్తున్న జనం
- వాహనాలతో రోడ్లన్నీ కిటకిట
- మరో మూడు రోజులూ ఇదే రద్దీ..

భీమవరం టౌన్/రూరల్/క్రైం/ఏలూరు, జనవరి 11(ఆంధ్రజ్యోతి): అతిపెద్ద పండుగ సంక్రాంతిరానే వచ్చింది. ఈ పండుగ కోసమే ఎదురుచూస్తున్న వేలాది మంది నేరుగా స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. ముందుగానే తమ వారికి కబురు పంపి మరీ చుట్టం చూపుగా వస్తున్నారు. చాన్నాళ్ళ తర్వాత అనేక కుటుంబాలు పండుగ పూట ఒకటవుతున్నాయి. ప్రత్యేకించి వరుస సెలవులు కలిసి రావడంతో ఒక్క హైదరాబాదు నుంచే కాకుండా చెన్నై, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాలతోపాటు విదేశాల్లో ఉన్న వారు ఇప్పటికే సొంతూళ్ళకు చేరుకుంటున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతానికి సంక్రాంతి కొత్తేమీ కాదు. పండుగ వచ్చిందంటే మూడు రోజులే కాదు.. అటు పది రోజులు, ఇటు పది రోజులు ఆ జోష్ కొనసాగిస్తారు. అన్ని పనులను పక్కనపెట్టేస్తారు. మహిళలంతా ముగ్గులు, వంటల్లో నిమగ్నమైతే మగవారంతా గానా బజానాల్లో తేలియాడుతారు. ప్రత్యేకించి ఎప్పుడు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న కోడి పందేల కోసం వేలాది మంది ఎదురుచూపులు. కోడి పందేలు, జూదం వద్దని, సంప్రదాయ పండుగే ముఖ్యమని ప్రభుత్వం ఒకవైపు, న్యాయస్థానాలు ఇంకోవైపు చైతన్య పరుస్తున్నా పాత వాసనలు వదులుకోవడానికి ఏ ఒక్కరూ సిద్ధపడడం లేదు. అందుకనే వారం రోజులుగా జిల్లాస్థాయిలో అటు పోలీస్, ఇటు రెవెన్యూ అధికారులు పనిగట్టుకుని కోడి పందేలు వద్దంటూ శతవిధాలా ప్రజలను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి. హైదరాబాదు నుంచి విశాఖ వరకు జాతీయ రహదారి మీదుగా కార్లు వరద సాగుతోంది. టోల్గేట్‌ల వద్ద ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. వందలాది వాహనాలు ఒకదాని వెంట ఒకటి సాగుతూనే ఉండడంతో రోడ్లన్నీ కిటకిటలాడుతున్నాయి. శనివారం హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలతో కలపర్రు, ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, సిద్ధాంతం, పాలకొల్లు రోడ్లన్నీ కిటకిటలాడాయి. మద్యం షాపుల్లో రెండు రోజులుగా అమ్మకాలు రెట్టింపు అయ్యాయి. రాబోయే ఐదు రోజులు మరింతగా దూసుకుపోబోతున్నాయి. ఇంతకు ముందైతే తెలంగాణ ప్రాంతం నుంచి తక్కువ ధరకు మద్యం తమ వెంటే తెచ్చుకుని ఇక్కడకు వచ్చేవారు. కాని ఇప్పుడా పరిస్థితి తొలగి మద్యం ధరలు ఇక్కడే అందుబాటులోకి వచ్చాయి.



జాతీయ రహదారిపై కలపర్రు టోల్ ప్లాజా వద్ద కార్ల రద్దీ

చెరువుగట్లే గమ్మత్తు ఆతిథ్యం

పట్టణ, నగర ప్రాంతాల్లో సేద తీరడానికి ఆస్కారం లేని అతిధులు తమ గ్రామానికి వస్తే వారిలో కొత్త జోష్ నింపే ప్రయత్నం జరుగుతుంది. తోటల్లో, చెరువుగట్ల మీద, పంట చేల నడుమ విందు, వినోదాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఊళ్ళకు చేరుకున్న వారంతా 'సండే స్పెషల్'కు సిద్ధపడుతున్నారు. తగిన సామగ్రి అనేక పల్లెల్లో కొబ్బరితోటలు, పామాయిల్ తోటలకు సరుకు చేరింది. ఆ మేరకు ఆట పాట సిద్ధపడుతున్నారు. ఇన్నాళ్ళు పచ్చదనం లేకుండా కేవలం కాంక్రీట్ జంగిల్‌లోనే గడిపిన వారందరికీ కొత్త టేస్ట్ తెచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. టెంట్ హౌస్‌ల నుంచి ఇప్పటి నుంచే తగిన సామగ్రిని తోటల్లోకి, చెరువు గట్ల మీదకు చేరింది. పెద్ద పండుగకు పెద్ద ఏర్పాట్లు పేరిట కొందరు బడా నేతలు సిద్ధపడుతున్నారు.

మార్కెట్‌లు కళకళ

రెండు రోజులుగా మార్కెట్‌లో అమ్మకాల జోరు పెరిగింది. పట్టణాలు, పల్లెల్లో దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారాయి. ఆది, సోమవారాల్లో అమ్మకాలు ఇదే స్థాయిలో ఉంటే సీజన్ తమకు ఊరట లభిస్తుందని వ్యాపారులు చెబుతున్నారు. రెడీమేడ్ షాపులతోపాటు, వస్త్ర దుకాణాలు కిక్కిరిసిపోతున్నాయి. బ్రాండెడ్ షాపులు, రోడ్డు పక్కన స్టాల్స్ అనే తేడా లేదు. ఆఫర్లు పెట్టి మరీ విక్రయాలు సాగిస్తున్నారు.

గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్

భీమవరం టౌన్/క్రైం జనవరి 11(ఆంధ్రజ్యోతి):సంక్రాంతి పండుగకు ఇతర ప్రాంతాల నుంచి ప్రయాణికులు తమ స్వగ్రామాలకు వస్తుండడంతో భీమవరం బస్ కాంప్లెక్స్ రద్దీగా మారింది. రాజమండ్రి, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం, అమలాపురం, ఏలూరు, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులన్నీ నిండిపోయాయి. ఉదయం నుంచి చిన్నా పెద్ద తేడా లేకుండా వాహనాలన్నీ రోడ్లపైకి రావడంతో ట్రాఫిక్ ఒక్కసారిగా పెరిగింది. జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. పండుగ షాపింగ్‌లకు పెద్ద సంఖ్యలో రావడంతో రోడ్లన్నీ జామ్ అయ్యాయి. ట్రాఫిక్‌లో ఇరుక్కుని గంటలపాటు ఇబ్బందులు పడి తీవ్ర అసహనానికి గురయ్యారు. తెలంగాణ, కర్నాటక నుంచి భారీ సంఖ్యలో కార్లు, మినీ వ్యాన్లు, మినీ బస్సులు రావడంతో ఈ రద్దీగా మరింత అధికమైంది. మారింది. సంక్రాంతి పండుగ రెండు రోజుల ముందే వచ్చిందా అన్నట్టు భీమవరంలో వాతావరణం కనబడింది. ప్రకాశం చౌక్, బుధవారం మార్కెట్, పోలీసు బొమ్మ సెంటర్, అంబేద్కర్ సెంటర్, బొంబే స్వీట్ సెంటర్, సరోవర్ సెంటర్, అడ్డవంతెన, చిన్న వంతెనలపై ట్రాఫిక్ చాలా సేటి వరకు ముందుకు కదల్లేదు. పోలీసు సిబ్బంది సరిపడినంత లేకపోవడంతో క్రమబద్దీకరించేందుకు అవస్థలు పడ్డారు.

కోడి పందేలకు బరులు సిద్ధం



తేతలిలో సిద్ధమవుతున్న బరి

భీమవరం రూరల్/క్రైం/తణుకు రూరల్/ఇరగవరం/అత్తిలి/పెనుమంట్ర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిలో ముగ్గులు, పిండి వంటలు, భోగి మంటలు ఉన్నట్లుగానే కోడి పందేల బరులు ఆనవాయితీగా మారాయి. గత ఏడాది వరకు నిర్ణయించిన ప్రదేశాల్లోనే బరులుండేవి. ఈసారి ప్రతి గ్రామంలోనూ ఉత్సాహం పెరిగింది. తమ ఊరిలోను పందేలు జరగాల్సిందేనని పట్టుదలతో వీటిని ఏర్పాటు చేయిస్తున్నారు. ఎక్కడికక్కడ నేలను చదును చేసే పనులు జరుగుతున్నాయి. మరోవైపు పందేలు, జూదాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే సహించేది లేదని పోలీస్, రెవెన్యూ యంత్రాంగం హెచ్చరికలు చేస్తోంది. పదుల సంఖ్యలో బైండోవర్ కేసులు పెడుతోంది. అయినప్పటికీ కోడి పందేల బరులను సిద్ధం చేస్తూనే ఉన్నారు. భీమవరం రూరల్ మండలం తాడేరు, కాళ్ల మండలం పెద అమిరం, సీసలి, నర్సాపురం, మొగల్తూరు, ఆకివీడు, తణుకు మండలం దువ్వ, తేతలి, వేల్పూరు, ఇరగవరం మండలం గోటేరు, కత్తవపాడు, రేలంగి, ఓగిడి, అయినపర్రు, అత్తిలి మండలం అత్తిలి, కెఎస్ గట్టు, గుమ్మంపాడు, లక్ష్మీనారాయణపురం, తిరుపతిపురం శివారు రామచంద్రపురం, పెనుమంట్ర మండలం మార్టేరు, వెలగలేరు, ఆలమూరు, పెనుమంట్ర, వీవీ పాలెం, నత్తా రామేశ్వరం, జుత్తిగ తదితర ప్రాంతాల్లోబరులను సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది పందెం కోళ్ల ధరలు పెరిగాయి. ఒక్కోటి రెండు నుంచి 50 వేల వరకు ఉన్నాయి.

జూదాల జోలికి వెళ్లొద్దు : ఎస్పీ నయీం

కోడిపందాలు, జూదాలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 'జిల్లాలో కోడిపందేలు ఆడేవారు, నిర్వాహకులు, కోడి కత్తుల తయారీదారులు, పేకాట శిబిరాలు నిర్వహించేవారు, ఆడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా లాడ్జిలు, హోటళ్లను పండుగ సమయంలో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తాం. రెవెన్యూ, ఎక్సైజ్, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) టీమ్‌లు నిరంతరం తనిఖీలు, సోదాలు చేసి కేసులు నమోదు చేస్తాయి. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా 24/7 ప్రత్యేక నిఘా ఉంటుంది. సరిహద్దుల్లో ప్రత్యేక చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. జూదాలకు స్థలాలిచ్చే వారిపైన కేసులు నమోదు చేస్తాం. ఎవరైనా జూదాలు నిర్వహిస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు గాని, 112కు గాని ఫోన్ చేసి సమాచారం తెలియజేయాలి. వీరి వివరాలను గోప్యంగా ఉంచుతాం' అని తెలిపారు. కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.



తాడేరులో సిద్ధమవుతున్న కోడి పందేల బరి



ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర బృందం, మంత్రి నిమ్మల

2027 నాటికి పోలవరం పూర్తి

- రాష్ట్ర భారీ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల
- కేంద్ర పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ప్రాజెక్టు పరిశీలన
- బృందంలో 11 మంది ఎంపీలు, 27 మంది ఇంజనీర్లు

మెయిన్‌లో..



పండుగ వేళ విషాదం

అన్నవరం వెళుతుండగా లారీని ఢీకొన్న కారు.. ముగ్గురు భీమవరం వాసుల మృతి.. నలుగురికి గాయాలు 7

సందళ్లే.. సందళ్లే.. సంక్రాంతి.. సందళ్లే..





తెలుగింట పెద్ద పండుగ సంక్రాంతి.. మన సంస్కృతీ సంప్రదాయాలను చాటి చెప్పే పండుగ.. నిజం చెప్పాలంటే పల్లె పండుగ.. లంగా ఓణీల్లో పల్లె పడుచుల సందడి.. కొత్త అల్లుళ్ల హడావుడి.. బంధుమిత్రుల పలకరింపులతో ఇళ్లన్నీ కళకళలాడిపోతాయి.. ఉదయాన్నే ముంగిట ముచ్చటైన ముగ్గులు.. చిన్నారుల గొబ్బెమ్మల ఆటలు.. తెలతెలవారుతుండగా హరిదాసుల కీర్తనలు.. గంగిరెద్దుల వారి విన్యాసాలు.. జంగమ దేవరలు.. పిట్టలదొరల కబుర్లు.. ఇంటి ఆవరణలో మన ఆడవాళ్ల పిండివంటల మీటింగ్‌లు.. ఒకటేమిటి.. అన్నీ.. పిల్లా పెద్దా అంతా సందడి చేసే ఒక ఉత్సవం.. సంక్రాంతి.. అంతా అయిపోయి ఎవరిళ్లకు వారు వెళ్లిపోతే మళ్లీ ఎప్పుడు వస్తుందా అని సంవత్సరమంతా ఎదురుచూసే పండుగ..సంక్రాంతి..



భోగి మంటలు

సంక్రాంతి పండుగ మూడు రోజుల్లో మొదటిది భోగి..గ్రామాల్లో గోవు పేడను సేకరించి పిడకలుగా చేస్తారు. అలా నెలరోజుల పాటు చేసిన ఈ పిడకలను భోగి రోజున కర్రలతో కలపి మంటను వెలిగిస్తారు. ఈ మంటల్లో భోగి పిడకలను వేస్తారు.. భోగి మంటలకు అవసరమైన కట్టెలను పిల్లలు వారం రోజుల ముందు నుంచే సేకరిస్తుంటారు..

తణుకు రూరల్ / ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)





గొబ్బెళ్లోయ్..గొబ్బెళ్లోయ్



సంక్రాంతికి గ్రామాల్లో ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ప్రతీ ఇంటి ముందు ముత్యాల ముగ్గులు అందంగా కొలువుదీరుతాయి.. వాటి మధ్యన ఆవు పేడతో చేసిన ముద్దను ఉంచడం ఆనవాయితీగా వుంటుంది. సంక్రాంతి పండుగ మూడు రోజులూ ప్రత్యేక ముగ్గులతో పాటు ఆఖరు రోజున రథం ముగ్గుతో సాగనంపే ముగ్గుతో ఈ ముగ్గుల ప్రక్రియ ముగుస్తుంది.

జంగము దేవరులు



అంబపలుకు..జగదంబ పలుకు.. కాశీ అన్నపూర్ణమ్మ...పలుకు అంటూ శంఖారావం చేస్తూ జంగమ దేవరులు.. వస్తుంటారు శ్రీశైలం సమీపంలోని అటవీ ప్రాంతాల నుంచి పలువురు జంగమదేవరులు ప్రతీ ఏటా జిల్లాలోని పలు ప్రాంతాలకు వచ్చి సంచరిస్తుంటారు. శంఖారావాలతో శివుని కీర్తిస్తూ దాతలను ఆశీర్వదిస్తుం టారు. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి తెల్లవారు జామున డమరుకం వాయిస్తూ గ్రామీణులను నిద్రలేపుతారు.

పిట్టల దొర.. సోదెమ్మలు

ఆనాటి గ్రామీణులకు హాస్య భరితమైన మాటలతో గ్రామీణులను, ముఖ్యంగా మహిళలను సొంత అక్కగా ఎన్నో కానులకు అందిస్తున్నట్లు చెప్పే మాటలను విని అంతా నవ్వుకుంటుంటారు. ఆనాటి విలువైన వంటకంగా పప్పు దాకలో పడిపోతున్నట్లుగా ఎన్నో హాస్యభరితమైన మాటలు చెబుతాడు. సోదె చెబుతామమ్మ.. సోదె చెబుతాం అంటూ ఆనాటి గ్రామీణుల భవిష్యవాణిని చెప్పేవారు సోదెమ్మలు. ఇంటింటికి వచ్చి నాలుగు మాటలు చెప్పి వారి ఇచ్చింది సంతోషంగా తీసుకు వెళ్లేవారు..

గంగిరెద్దుల విన్యాసాలు

గంగిరెద్దుల ఆట మన సంప్రదాయంలో భాగం.. సంక్రాంతి నెల ప్రారంభం నుంచి గంగిరెద్దులతో వీధుల్లో తిరుగుతూ ఆటలాడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడిలా భావించి మన ఇంటివారు వాటికి హారతి ఇచ్చి పూజిస్తారు.. అమ్మగారికి దండం పెట్టు.. అయ్యవారికీ దండం పెట్టు..అని అనగానే ముందరి కాళ్లెత్తి నమస్కరిస్తాయి.. ఇంటివాళ్లను పొగుడుతూ వారు ఆశీర్వదిస్తారు..

కోడి పందేలు

గ్రామీణులకు సంక్రాంతికి ప్రధాన క్రీడ కోడి పందాలు. దీని కోసం ప్రత్యేకంగా కోడి పుంజులను పెంచి వాటిని సంక్రాంతి రోజున పందేలకు ఉపయోగిస్తారు. గతంలో వీటి కాళ్లకు కత్తులు కట్టకుండా కేవలం డింకీ పందాలను వేసి వినోదంగా చూసేవారు. ప్రస్తుతం పందెం కోళ్లను ఎంతో శ్రద్ధగా పోషకాహారంతో పెంచి పందాల కోసం తయారు చేస్తూ కొంతమంది ఉపాధి పొందుతుడగా కొందరు లక్షలాది రూపాయాల చేతుల మారే జూద క్రీడగా మార్చేశారు.



పిండి వంటలు



సంక్రాంతి పండుగ అంటే పిండి వంటలు కూడా. బియ్యంతో చేసిన వివిధ పిండి వంటలు సంక్రాంతి నెల ప్రారంభం కాగానే ప్రారంభిస్తారు. ఆ..రోజుల్లో రైతుల పొలంలో పండిన ధాన్యాన్ని ఇంటికి తీసుకు వస్తే వాటిని రోళ్లలో పోసి రోకళ్లతో దంచి బియ్యంగా మార్చి పిండి వంటలు చేసేవారు. నెల రోజులు ముందు నుంచే మహిళలు ఒకరికొకరు సాయం చేసుకునేవారు.. అందుకే సంక్రాంతి పండుగ కళకళలాడుతూ వుండేది. అరిసెలు, పాకం ఉండలు, కజ్జికాయలు, సున్నుండలు, జంతికలు వంటివి ప్రధానంగా చేస్తారు. ఇవన్నీ ఆరోగ్యాన్ని అందించే వంటలుగా చెబుతారు.



హరిదాసుల కీర్తనలు

సంక్రాంతి నెల ప్రారంభం నుంచి ముందుగా గ్రామాల్లో హరిదాసుల సంచారంతో మొదల వుతుంది... తెల్లవారు జామునే నగర సంకీర్తనలు చేస్తూ వీధులలో సంచరించి సంక్రాంతి విశిష్టతను తెలిపే కీర్తనలు ఆలపిస్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన హరిదాసులు స్వగ్రామంలోనే కాకుండా ఇతర చుట్టుపక్కల ప్రాంతాలలో తిరుగుతుంటారు. ఈ పండుగ దినాల్లో బియ్యం, నాణాలు, ఇవ్వనిదే పనులు మొదలు పెట్టని ఆచారం కూడా కొన్నిచోట్ల ఉంది.



భీమవరం కుర్రాళ్ల దుంగల వేట.. భోగి మంటల్లో వేసేందుకు..

పండుగ వేళ.. ధరల మోత



వినియోగదారులను దోచుకుంటున్న వ్యాపారులు, దళారులు

పండుగ వేళ ధరలు మోతెక్కుతున్నాయి.. నిత్యావసర సరుకులు నింగిని తాకుతున్నాయి. కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. బియ్యం రేట్లు బరువెక్కాయి. వంట నూనెలు సలసల కాగుతున్నాయి. చికెన్ ధరలు చుక్కలంటుతున్నాయి. సంక్రాంతి పండుగ పేరుతో వ్యాపారులు, దళారులు దోచుకుంటున్నారు.

ఏలూరు టూటౌన్, జనవరి 11 (ఆంధ్ర జ్యోతి): సంక్రాంతి పండుగకు పిండివంటలు చేసుకోని కుటుంబం ఉండదు. పిండి వంట లకు కావల్సిన బెల్లం, పప్పులు, వంటనూనె ధరలను అమాంతం పెంచేశారు. వంటనూనె 125 రకాన్ని బట్టి రూ.165వరకు అమ్ము తున్నారు. బియ్యం కిలో రూ.50 నుంచి రూ. 75 వరకు ఎగ బాకింది. బాస్మతిరైస్ రూ.80 నుంచి 120కి చేరుకుంది. కందిపప్పు కిలో రూ. 150 నుంచి 180 వరకు ఉంది.. పండుగ నాటికి రూ.200లకు చేరుకున్నా ఆశ్చర్యపోన వసరం లేదు. పెసరపప్పు రూ.125-150 వరకు రకాన్ని బట్టి అమ్ముతున్నారు. వేరుశనగ పప్పులు రూ.140 - 170కి ఎగబాకింది. చింతపండు రూ.220 - 300 వరకు, నెంబర్ వన్ చింతపండు రూ.400వరకు చేరుకుంది. మినపగుళ్ళు రూ.130 నుంచి 160కి చేరుకున్నాయి. వెల్లుల్లి గత కొన్ని నెలల నుంచి కేజీ రూ.400 నుంచి దిగి రావడం లేదు.

కూరగాయలు కొండెక్కాయి..

కూరగాయల ధరలు కూడా కొంతకాలం నుంచి దిగి రావడం లేదు. రెండునెలల కింద వరదలు వచ్చినప్పటి నుంచి పంటలు కొట్టుకుపోయాయి. తరువాత వేసిన పంటలు తెగుళ్ళు వచ్చి దిగుబడులు తగ్గటంతో కూరగాయ ధరలు కొండెక్కి కూర్చున్నాయి. సాధారణంగా దొండకాయలు, బెండకాయలు, వంకాయలు కిలో రూ.20 నుంచి 30 లోపు ఉండేవి. ఇప్పుడు కేజీ రూ.50 -60వరకు అమ్ముతున్నారు. చిక్కుడు కాయలు రూ.100 చేరుకున్నాయి. కంద రూ.80, చామదుంపలు రూ.60 వరకు అమ్ముతున్నారు. ఫ్రెంచ్‌బీన్స్, క్యాప్సీకం హైదరాబాదు నుంచి దిగుమతి అవడంతో రూ.80 నుంచి 100 వరకు అమ్ముతున్నారు. బంగాళదుంపలు రూ.20కి మించి ఎప్పుడు ఉండేవి కావు. కొన్ని నెలల నుంచి రూ.40కు అమ్ముతున్నారు. ఆకుకూరలు కూడా గుంటూరు నుంచి దిగుమతి కావడంతో రూ.10 నుంచి 15 వరకు అమ్ముతున్నారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండే దోసకాయ, ఆనబకాయ, పొట్లకాయలు కూడా రూ. 40 పైనే అమ్ముతున్నారు.

మాంసాహారులకూ చుక్కలే..

ఇక చికెన్ ధరలకు వస్తే కేజీ లైవ్ - 140, బ్రాయిలర్ రూ.200 , స్కిల్‌లెస్ రూ.240, ఫారం కోడి రూ.180లకు చేరాయి. చేపలు విషయానికి వస్తే కొరమేను రూ.400, రొయ్యలు రకాన్ని బట్టి ఉ.200 - 400 వరకు, తెల్లచేపలు రూ.170 నుంచి 200లు, పీతలు రూ.250కి చేరుకున్నాయి. మటన్ సంగతి చెప్పాల్సిన పని లేదు కేజీ రూ.900 నుంచి 1000 లకు చేరుకుంది. పండుగలను అడ్డం పెట్టుకుని ప్రతీసారి దళారులు, వ్యాపారులు కలిసి రేట్లు పెంచేసి వినియోగదారుల నోట్లో మట్టికొడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించడానికి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఏం కొనాలన్నా భయమే



నిత్యావసర వస్తువులు, కూరగాయలు, చేపలు, చికెన్, రైస్, వంటనూనెలు ఏది కొనాలన్నా భయమేస్తుంది. పండుగలకు బంధువులు, స్నేహితులు వస్తారు. వాళ్ళను సంతోష పెట్టాలంటే ఎంత రేటైనా కొనాలి. ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగిపోయి ఉన్నాయి. పండుగ సీజన్‌ను అసరాగా తీసుకుని వ్యాపారులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. దళారులను, వ్యాపారులను నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వల పై ఉంది.

- బండి సూర్యప్రకాశ్, ఏలూరు

ఇష్టానుసారం పెంచం



ధరల రేట్లు పెరుగుదల మా చేతుల్లో ఉండదు. సాధారణంగా పండుగలకు ఎంతో కొంత రేట్లు పెంచుతూనే ఉంటారు. మాకు వచ్చిన ధరల కన్నా ఖర్చులు వేసుకుని ఎంతో కొంత లాభం చూసుకుంటాం...అవకాశం ఉంది కదా అని ఇష్టానుసారం రేట్లు పెంచి అమ్మితే తరువాత మా బిజినెస్ అంతగా సాగదు.

- మూర్తి, హోల్‌సేల్ వ్యాపారి, ఏలూరు

100 పిడకలు 'వంద' రూపాయలు



సంక్రాంతి పండుగలో ముఖ్యమైనది భోగి పండుగ. ఆ రోజున భోగి మంటల్లో ఆవు పేడతో చేసిన పిడకలు వేస్తారు. ఇప్పుడు ఆవులూ తగ్గిపోయాయి.. ఆవు పిడకలు తయారు చేసేవారూ తగ్గిపోయారు. దీంతో ఇప్పుడు రడీమేడ్ బోగి పిడకలు మార్కెట్‌లో దర్శనం ఇస్తున్నాయి. భీమవరంలో వారం రోజులుగా పిడకల అమ్మకాలు చేస్తున్నారు..పిడక రూపాయి చప్పున అమ్ముతున్నారు. 100 పిడకల దండ రూ.100 రూపాయిలు అమ్ముతున్నారు **- భీమవరం టౌన్**

వెరైటీ గాలిపటాలు



సంక్రాంతి పండుగ వస్తోందంటే పిల్లలకు సందడే సందడి గాలిపటాలు ఎగవర వెయ్యడం మంచి సరదా.. గాలిపటాల సంప్రదాయం మన దగ్గర లేదు..కానీ ఇటీవల సంక్రాంతిలో ఇది కూడా చేరింది. ఇప్పుడు వివిధ రకాల్లో రెడీమేడ్ గాలిపటాలు మార్కెట్‌ను ముంచుతున్నాయి. ఈగల్, పెద్దపులి, సినిమా యాక్టర్ల బొమ్మలు తదితర మోడల్స్‌లో విక్రయిస్తున్నారు. ఒక్కోటి రూ. 50 నుంచి 500 వరకు అమ్మకాలు చేస్తునారు..

కాళ్లకూరులో కూడారై ఉత్సవం



కాళ్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కూడారై పూజ నిర్వహించారు. కుడారై అక్కరను (పాయసం) ప్రసాదాన్ని తయారు చేసి 1250 గిన్నెలతో స్వామి, అమ్మవార్లకు నివేదించారు. ఆలయ అర్చకులు పాశురములు గానం చేశారు. ఆలయంలో పుష్పాలతో శంఖు చక్రం, స్వామి నామాలను అలంకరణ చేశారు. యతిరాజుల ఆండాళ్ గోష్టి వారు గోదాదేవి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఈవో మోకా అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో కూడారై పూజ సందర్భంగా 1250 పాత్రల్లో పాయసం నివేదన



వైభవం.. శ్రీవారి ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి, భూదేవి సమేత గోదాదేవితో కలసి చిన్నతిరుమలేశుడు తొళక్కవాహనంపై శనివారం ఉదయం తిరువీధుల్లో అట్టహాసంగా ఊరేగారు.ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని ముందుగా ఆలయ ఆవరణలో తొళక్కం వాహనంపై స్వామి, అమ్మవార్లుతో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. ఆ తరువాత మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

అవనిపై హరివిల్లు

విజయవాడలో సందడిగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్

ప్రథమ బహుమతి గెలుచుకున్న తమిళనాడు మహిళ

కడప, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన హోంమంత్రి అనిత

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఫైనల్స్ శనివారం ఘనంగా జరిగాయి. విజయవాడలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని బ్యాడ్మింటన్ కోర్టులో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కలిపి మొత్తం 15 మంది పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని కె.భార్గవి (తమిళనాడు) సొంతం చేసుకోగా, మూడు ద్వితీయ బహుమతులను రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి) సొంతం చేసుకున్నారు. మిగిలిన 11 మంది కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. బహుమతుల ప్రదానోత్సవానికి హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ఫైనల్స్ పోటీలను ప్రారంభించారు. ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, సూరపనేని ఉషారాణి వ్యవహరించారు.

- ఆంధ్రజ్యోతి, విజయవాడ





ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు (ఇన్‌సెట్‌లో) పోటీదారులతో కలిసి జ్యోతి వెలిగిస్తున్న కృష్ణాజిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ





ద్వితీయ బహుమతులు అందుకుంటున్న రమ్య (కడప), సావిత్రి (తూర్పు గోదావరి), వేణుభార్గవి (పశ్చిమ గోదావరి).. (కుడి నుంచి ఎడమకు), ముగ్గులు పరిశీలిస్తున్న మంత్రి అనిత





కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న పి.జ్యోతి (శ్రీకాకుళం), ఎం.రాజు (విజయనగరం), నాగమల్లేశ్వరి (కృష్ణా), డి.ఉష (నెల్లూరు), కవిత (ప్రకాశం), ఏ.సునీత (గుంటూరు), జి.శ్రీలక్ష్మీ (కర్నూలు), ఎస్.రమ్యకృష్ణ (అనంతపురం), రెడ్డిరాణి (చిత్తూరు), ఏ.సంతోషి (విశాఖపట్నం), రోహిణి (కర్ణాటక). చిత్రంలో ఏపీ సెంట్రల్ డెస్క్ ఇన్‌చార్జి టి.సురేష్, న్యూస్ ఎడిటర్ కె.నాగసుధాకర్, విజయవాడ యూనిట్ మేనేజర్ వేమూరి మురళీ, న్యాయనిర్ణేత అబ్బూరి రత్నలక్ష్మి

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కొయ్యలగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన స్థానిక కాళీంగపేటలో చోటు చేసుకున్నది. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం చిందాడ కర్ణుడు (62) కొంతకాలంగా ఫైల్స్, షుగర్, వంటి ఇబ్బందులతో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 9వ తేదీన పురుగు మందు తాగి ఇంటికి వచ్చాడు. జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి, అనంతరం ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తల్లిదండ్రులు డబ్బు ఇవ్వడం లేదని యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఒక యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం వైఎస్ఆర్ కాలనీకి చెందిన ఎల్లోజు వినయ్ (24) కార్పెంటర్ పనులు చేస్తూ ఉంటాడు. అతనికి వివాహం కాలేదు. తల్లి దండ్రులను డబ్బులు ఇవ్వాలంటూ రోజూ వేధిస్తున్నాడు. వారు నిరాకరించడంతో శనివారం ఉదయం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

దెందులూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): దెందులూరు మండలంలో ఉండ్రాజవరం అడ్డరోడ్డు సమీపంలో శనివారం వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శనివారం తెల్లవారుజామున రోడ్డుపై నడుస్తు వెళ్తుండగా వెనుక నుంచి వాహనం ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కొంత మంది మాత్రం చదలవాడ సోమయ్య అని చెబుతున్నప్పటికి మృతుడి వివరాలు పూర్తిగా తెలియాల్సి ఉందని దెందులూరు ఎస్ఐ శివాజీ తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే దెందులూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు

లారీ ఢీకొని భార్య మృతి, భర్తకు గాయాలు



రామసీత (ఫైల్)

పాలకోడేరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. కోరుకొల్లు గ్రామానికి చెందిన భార్యాభర్తలు ఉద్ధరాజు బాపిరాజు, భార్య రామసీతను టీవీఎస్ మోపెడ్‌పై ఎక్కించుకుని భీమవరం వైపు నుంచి కోరుకొల్లు వైపు వెళ్తుండగా పాలకోడేరు గ్రామంలోని మోగల్లు రోడ్డులో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో లారీ చక్రాల కింద పడి ఉద్ధరాజు రామసీత (63) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త బాపిరాజుకు గాయాలయ్యాయి. పాలకోడేరు ఎస్ఐ రవివర్మ కేసు నమోదు చేశారు.

పండుగ వేళ విషాదం

- అన్నవరం వెళుతూ లారీని ఢీకొన్న కారు..
- ముగ్గురు భీమవరం వాసుల మృతి.. నలుగురికి తీవ్ర గాయాలు.. బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరు

భీమవరం క్రైం/శంఖవరం, జనవరి 11(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడిలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని కారు వెనుక నుంచి ఢీకొంది. అన్నవరం దైవదర్శనానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరం టౌన్‌కి చెందిన చవ్వాకుల శ్యాంప్రసాద్, అతని బావమరిది కరింశెట్టి శివన్నారాయణ, శివన్నారాయణ భార్య దివ్య, సత్యనాగమధు, శ్యాంప్రసాద్ భార్య చవ్వాకుల ప్రసన్న, తల్లి అమ్మాజీ, కారు డ్రైవర్ నిమ్మగడ్డ ధనుష్ కలిసి శనివారం తెల్లవారుజామున అన్నవరం రావడానికి ఉదయం 4-5 గంటల మధ్యలో కారులో బయలుదేరారు. వీరి వాహనం ఉదయం 7 గంటల సమయంలో అన్నవరానికి దగ్గర్లోనే పది కిలోమీటర్ల ముందు కత్తిపూడి వద్దకు చేరుకుంది. అక్కడ ఆగిఉన్న లారీని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో చవ్వాకుల శ్యాంప్రసాద్(50), కరింశెట్టి శివన్నారాయణ (38), కరింశెట్టి దివ్య(30) అక్కడికక్కడే మృతి చెందగా మిగిలినవారు తీవ్రంగా గాయపడ్డారు. శ్యాంప్రసాద్ భార్య ప్రసన్న, తల్లి అమ్మాజీ అపస్మారక స్థితిలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డ్రైవర్ ధనుష్ మాత్రం స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదానికి స్పష్టమైన కారణం తెలియనప్పటికీ నిద్రమత్తుగానీ, లారీని గమనించక పోవడంగానీ అయి ఉండొచ్చని భావిస్తున్నారు. క్షతగాత్రులను తుని, ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లారు. ప్రత్తిపాడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కరీంశెట్టి శివనారాయణ మృతి చెందగా అమ్మాజీ, సత్యనాగమధులను మెరుగైన వైద్యంకోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అన్నవరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



భీమవరంలో బాధిత కుటుంబ సభ్యుల రోదనలు.. చవ్వాకుల శ్యాంప్రసాద్ (ఫైల్‌ఫొటో)..

ఆగిన లారీయే కారణం

జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీలను ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. జాతీయ రహదారిపై పార్కింగ్ ప్రాంతాల్లో మాత్రమే లారీలు నిలపాల్సి ఉండగా, ఇష్టానుసారంగా ఎక్కడబడితే అక్కడ లారీలను నిలుపుతున్నారు. ఆగి ఉన్న లారీలపై పోలీసులు తీసుకుంటున్న చర్యలు శూన్యమనే చెప్పాలి. ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత పడడంతోపాటు వందల సంఖ్యలో క్షతగాత్రులుగా మిగిలిపోతున్నారు.

భీమవరంలో విషాధఛాయలు

చవ్వాకుల శ్యాంప్రసాద్ మృతితో భీమవరంలోని ఆయన నివాసం వద్ద విషాదచాయలు అలముకున్నాయి. అతడు భీమవరం గన్నాబత్తుల వారివీధిలో ఉంటున్నాడు. ఆయనకు సంతానం లేరు. యనమదుర్రులో వ్యవసా యం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని బా వమరిది అయిన కరింశెట్టి శివన్నారాయణ కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలానికి చెందినవాడు. ఆయన కూడా ప్రస్తుతం భీమవరంలోనే ఉంటున్నారు. అతనికి కూడా సంతానం లేనట్లుగానే బంధువులు తెలిపారు.

18న నవోదయ ప్రవేశపరీక్ష

పెదవేగి, జనవరి 11(ఆంధ్రజ్యోతి) : పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్వీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి ప్రవేశపరీక్ష ఈనెల 18న జరుగుతుందని జేఎన్వీ ప్రిన్సిపాల్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ప్రిన్సిపాల్ తెలిపిన వివరాలు ప్రకారం.. 'మొత్తం 26 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఏలూరు జిల్లాలో 10, పశ్చిమగోదావరిలో 14, తూర్పు గోదావరిలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశాం. జేఎన్వీలో 6వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. 5,828 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రవేశపరీక్ష ఈనెల 18వ తేదీ శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుంది. పరీక్షా సమయానికి గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌వీఎస్ ఏఐపీ.ఇన్/ సీబీఎస్ ఈఐటీఎంఎస్.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్ల నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వివరాల కోసం 63030 39477, 94907 28768, 96406 76608, 90785 68664, 89748 33690, 94917 31486 హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలి' అని సూచించారు.

వందేభారత్‌కు అదనపు కోచ్‌లు

ఏలూరు క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నుంచి సికింద్రాబాద్, సికింద్రాబాద్ నుంచి విశాఖకు నడుస్తున్న వందేభారత్ రైళ్లకు జనవరి 13వ తేదీ నుంచి అదనపు కోచ్‌లను శాశ్వతంగా ఏర్పాటు చేస్తున్నట్టు విజయవాడ దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

ఒంటరి మహిళలే టార్గెట్

అంతర్‌రాష్ట్ర దొంగను పట్టుకున్న పోలీసులు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 11(ఆంధ్రజ్యోతి):చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి ఒంటరిగా ఉంటున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని, తాళాలు వేసిన ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడ్డ నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.36లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ విశ్వనాథ్ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని పట్టణ పోలిస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నిందితుడి వివరాలు వెల్లడించారు. బాపట్ల జిల్లా వెంగాల చెరువుకు చెందిన జంగాల స్వరూప్‌కుమార్ కుమార్ ముందుగా ఒంటరిగా ఉన్న మహిళలు ఎక్కడ ఉన్నారో రిక్కీ నిర్వహిస్తాడు. ఆ క్రమంలో అనుకూలంగా ఉన్న తాళాలు వేసిన ఇళ్లను కూడా తన చోరీలకు అనువుగా ఎంచుకుని తన పని కానిస్తాడు. ఈ తరహా చోరీలు రాష్ట్రంలో సుమారు 20కి పైగా స్వరూప్‌పై కేసులు నమోదయ్యాయి. తాడేపల్లిగూడెం పట్టణంలో పలు చోరీలకు పాల్పడినట్టు గుర్తించారు. పట్టణ సీఐ నాగరాజు ఆధ్వర్యంలో ఎస్సైలు నాగరాజు, బాలం శ్రీనివాస్‌లు, సిబ్బంది బృందాలుగా ఏర్పాడి నిఘా పెట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న స్వరూప్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ కేసు ఛేదించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు.

భీమవరంలో రూ.24 కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



దాత సత్యనారాయణరాజును సన్మానిస్తున్న మంత్రి సత్యకుమార్, డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, బాపిరాజు

ఆకివీడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రభుత్వాసుపత్రికి రూ.24కోట్లతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేస్తున్నట్టు వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రి ప్రాంగణంలో రూ.1.99కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల ఓపీ విభాగాన్ని, రూ.65లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన నాలుగు పడకల డయాలసిస్ కేంద్రాన్ని డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణితో కలిసి ప్రారంభించారు. ఆసుపత్రిలో అన్ని విభాగాలు పరిశీలించి, ప్రజలకు అందిస్తున్న వైద్య సహాయాలపై వైద్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడమే కాకుండా నిరంతరాయంగా పనిచేయడానికి అవసరమైన వైద్య, టెక్నికల్ తదితర సిబ్బందిని కూడా ఏర్పాటుచేసిన దాత దాట్ల సత్యనారాయణరాజు అభినందనీయులన్నారు. ఉద్దానంలో సుమారు 34వేల కిడ్నీ కేసులున్నాయని, సీకేడీగా మారకుండా నిరంతర సేవలను అందించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. గత ప్రభుత్వం నాణ్యతలేని మద్యం సరఫరా కారణంగా 1300 శాతం కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరిగారని, ఎన్నో కుటుంబాలు ఛిద్రం అయ్యాయన్నారు. మన రాష్ట్రంలో లక్ష మందికి పైగా కిడ్నీ వ్యాధిగ్రస్తులున్నారని అన్నారు. ప్రస్తుత జీవనశైలి కారణంగా క్యాన్సర్ వంటి రోగాలను నిరోధించేందుకు ఎన్సీడీ సర్వేను ప్రస్తుతం నిర్వహిస్తున్నామన్నారు. సర్వే నివేదికలను రెండు నెలలు అధ్యయనం చేసి రానున్న ఆరు నెలలో క్యాన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. హార్ట్ ఎటాక్ నివారణకు ముందస్తుగా పీహెచ్‌సీలలో ఇంజక్షన్ అందుబాటులో ఉంచడం జరిగిందని, రాష్ట్ర వ్యాప్తంగా గుండె జబ్బులకు చెందిన 965 మందిని మరణించకుండా కాపాడుకోకలిగామన్నారు.

టూరిజానికి మంచి భవిష్యత్: మంత్రి దుర్గేష్



ఎంపీ అప్పలనాయుడు దంపతుల్ని సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా టూరిజం రంగానికి మంచి భవిష్యత్ ఉందని, ఈ రంగానికి సంబంధి ంచిన కోర్సుల్ని కళాశాల లో ప్రవేశపెట్టాలని టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. శనివారం వైఎన్ కళాశాల ప్లాటినం ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం వల్లే గత ఏడు దశాబ్ధాలుగా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోగలిగారన్నారు. ఎంపీ అప్పలనాయుడు, హైకోర్టు న్యాయమూర్తి జయసూర్య మాట్లాడుతూ చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను కూడా పెంచాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి భవాని ప్రసాద్, గేయ రచయిత అనంత శ్రీరామ్, డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, పొన్నపల్లి రామారావు పాల్గొన్నారు.

అంతర్వేది-నరసాపురం అనుసంధానం

అంతర్వేది, నరసాపురం, పేరుపాలెంలను అనుసంధానం చేస్తూ తీరం వెంబడి టూరిజంను అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చెప్పారు. వైఎన్ కళాశాలలో ఆయన మాట్లాడుతూ గోదావరి తీరంలో అహ్లాదకరమైన వాతావరణం, పర్యటక, ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నప్పటికి సరైన వసతులు లేవన్నారు.





మాంటిస్సోరిలో సంక్రాంతి సంబరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి దంపతులు.. హరిదాసులతో విద్యార్థులు



టీబీఆర్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొలిశెట్టి, సంస్థ చైర్మన్ భోగేశ్వరరావు



ఉండిలో 100 అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు



గణపవరం ఇండియన్ డిజిటల్ స్కూల్‌లో ధాన్యం మాసూళ్లు చేస్తున్న విద్యార్థులు

సంక్రాంతి సంబరాలు

తణుకు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తణుకు మాంటిస్సోరి స్కూలు, జూనియర్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంప్రదాయాలు ఉట్టి పడేలా పలు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. బొమ్మల కొలువు, ముగ్గులు, హరిదాసు కీర్తనలు, చిన్న పిల్లలుకు భోగిపండ్లు వేయడం, ఎద్దుల బండి, గంగిరెద్దుల విన్యాసాలు, బోగిమంటలు, జంగమదేవరలు, పగటి వేషధారులు, సోదెమ్మ, పిట్టల దొర, వంటలు, సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు అలరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, కృష్ణతులసి దంపతులు పాల్గొన్నారు. మాంటిస్సోరి స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జ్ఞానమంజరి, కాలేజి అకడమిక్ డైరెక్టర్ కిషోర్, హెచ్‌ఎం ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తణుకు రూరల్: యువత జూదానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి కోరారు. శనివారం తేతలి పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొని 3 రోజులపాటు నిర్వహించే కబడ్డీ పోటీలను ప్రారంభించారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచ్ సరెళ్ల క్రాంతి ప్రియ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు అడ్డాడ శ్రీనివాసరాజు, నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు: సంస్కృతి సంప్రదాయాల పట్ల విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అలంపురం టీబీఆర్ డిఫెన్స్ అకాడమి ప్రాంగణంలో సంస్థ అధినేత తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. భోగిమంటలు, చిన్నారులకు గొబ్బిళ్లు, కోడి పందేల ఆటలు, ముగ్గులు, హరిదాసు, బుడబుక్కల వేషధారణల నడుమ వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సంప్రదాయ కళలను ప్రత్యేకంగా ప్రదర్శించిన టీబీఆర్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుముతులు అందజేసారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, బొలిశెట్టి రాజేష్, కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికుమార్, హెచ్‌ఎం కల్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అత్తిలి: అత్తిలి ఎస్‌వీఎస్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇరగవరం: ఇరగవరం జడ్పీ హైస్కూలులో శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పలు పోటీల్లో విజేతలైన వారికి ఎమ్మెల్యే ఆరిమిల్లి బహుమతులు అందించారు. ఎంపీడీవో ఎ. శ్రీనివాసు, తహసీల్దార్ సుందరరావు, ఎస్‌ఐ జానా సతీష్, వ్యవసాయ అధికారి వై రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్: భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాలలో 'సంక్రాంతి సంబరాలు' నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ. అనురాధ మాట్లాడుతూ రంగోలి, జానపద నృత్య ప్రదర్శనలు, సంప్రదాయ వంటకాలు, బొమ్మల కొలువు, భోగి మంటలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ ఎం. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం పాల్గొన్నారు.

కాళ్ళ: కాళ్ళకూరులో శనివారం దాట్ల శ్రీదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆకివీడు డీసి చైర్మన్ గోకరాజు శివరామరాజు పోటీలను ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని వివిధ రంగవల్లులు పలువురిని ఆకట్టుకున్నాయి. జి.నాగమణి మొదటి బహుమతి గ్రైండర్, ఎం.మౌనిక రెండవ బహుమతి మిక్సీ, ఎం.యశోధ మూడవ బహుమతి కుక్కర్ సాధించినట్లు ప్రకటించారు.

గణపవరం: గణపవరంలోని ఇండియన్ డిజిటల్ స్కూల్‌లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వరిమాసూళ్ళ చేయడం, నాట్లు వేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ప్రసాద్, పురప్రముఖులు తోట భాస్కరరావు, ఉపాధ్యాయులు, తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు : ఆర్టీవో

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పండగ పేరుతో లగ్జరీ బస్సుల్లో ప్రయాణికుల వద్ద అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని తాడేపల్లిగూడెం ఆర్టీవో సురేంద్ర సింగ్ నాయక్ హెచ్చరించారు. తాడేపల్లిగూడెం పట్టణ శివారుల్లో హైవే బస్సుల్లో శనివారం తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులను విచారించారు. ట్యాక్స్‌లు చెల్లించకుండా తిరుగుతున్న 54 బస్సులపై కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

జూదం అడ్డుకోవాలని వినతి

నరసాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తీరంలో జూదానికి అనుమతి ఇవ్వొద్దంటూ శనివారం డీఎస్పీ శ్రీవేద కు సీపీఎం నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కోడి పందేల ముసుగులో ప్రతి ఏటా గుండాట, పేకాట నిర్వహిస్తున్నారని, దీని వల్ల పేద కుటుంబాలు నష్టపోతున్నాయన్నారు. దీనిపై నిఘా ఉంచాలని ఎం. త్రిమూర్తులు, జోగేశ్వర రావు, కోడి లక్ష్మణరావు కోరారు.

మానవత్వం చాటిన 108 సిబ్బంది

తణుకు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని జాతీయ రహదారి శ్రీ చైతన్య స్కూలు ఎదురుగా ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి అదుపు తప్పి పడిపోగా అతనిని ఎవరూ గమనించలేదు. అటుగా వెళుతున్న 108 సిబ్బంది వాహనంలో ఎక్కించుకుని తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతని వద్ద రూ. 2 వేల 950 ఉండటంతో డ్యూటీ నర్సుకు అందించారు. సేవలో నిజాయితీ కనబర్చిన 108 సిబ్బంది మణిచైతన్య, సత్యనారాయణలను పలువురు అభినందించారు.

రీ సర్వేపై అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వేతో ఏళ్ల తరబడి ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటుందని తహసీల్దార్ ఎం. సునీల్ కుమార్ పేర్కొన్నారు. నవాబు పాలెంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని, టీడీపీ నాయకుడు మద్దుకూరి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పంపిణీ

తణుకు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో 26 మంది లబ్ధిదారులకు 37 లక్షల 95 వేల 151 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అంద జేశారు.

గంగాలమ్మ జాతర

నరసాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీ చర్లలో శనివారం గంగాలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. ఆది వారం అమ్మవారిని సముద్ర స్నానానికి తీసుకెళ్ళడం, 13న సారవ, 14న ఎల్‌బి చర్ల, 15 మోడీ గ్రామాల్లో అమ్మవార్ని ఊరేగిస్తామన్నారు. 16న ఆలయం వద్ద జాతర, 17న అఖండ సమారాధన జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

ముగ్గుల పోటీలు

పెనుమంట్ర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : డీవైఎఫ్‌ఐ, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ చింతపల్లి ఉదయ్ తెలిపారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో పొలమూరులో మహిళలకు ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, స్లో సైక్లింగ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందిస్తామన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

పెనుగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఆయాలుగా పని చేస్తున్న శానిటరీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పెనుగొండ పార్కు వద్ద శానిటరీ వర్కర్స్ సమావేశం అనంతరం నిరసన తెలిపారు. షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ బోర్డుల వితరణ

పెనుమంట్ర, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు ఎల్‌పి దంత వైద్య డాక్టర్ నూలి సందీప్ పోలీస్ శాఖకు ట్రాఫిక్ బారికేడ్స్ అందజేశారు. దాతను, స్టిక్కరింగ్ డిజైన్ వర్క్ చేసిన బయ్యే బాలాజీని పెనుగొండ సీఐ విజయ కుమార్ ఎస్‌ఐ కే స్వామి పెనుమంట్ర మండల జనసేన అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్ దీపక్ అభినందించారు.

గత ప్రభుత్వ అప్పులు తీర్చేందుకు పాట్లు

డయాలసిస్ యూనిట్ ప్రారంభోత్సవంలో మంత్రి సత్యకుమార్



ఆకివీడు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం రాష్ట్రంలో వేలుకోట్లు అప్పు చేసి వెళ్ళిపోయింది. ఇప్పుడు అవి తీర్చలేక ఇబ్బందులు పడుతున్నామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అన్నారు. స్థానిక సీహెచ్‌సీ ప్రాంగణంలో నిర్మించిన ఓపీ విభాగాన్ని, డయాలసిస్, ఆర్వో ప్లాంటును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. డయాలసిస్ ఏర్పాటుకు రావాలని ఉప సభాపతి ఆర్ఆర్ఆర్ కోరారన్నారు. రానంటే శాసన సభా వ్యవహారాల్లో జీవితకాల బహిష్కరణకు గురయ్యే ప్రమాదం ఉందంటూ చమత్కరించారు. దాత సత్యనారాయణరాజు నాల్గుపడకల డయాలసిస్ యూనిట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ ఈ ఆసుపత్రి ప్రక్కనే ఉన్న డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించి ఉద్యానవనంగా తీర్చిదిద్దుతామన్నారు. ఏపీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ ఎటువంటి సహాయ సహకారాలు అందించడానికైనా తాను ముందుంటానన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ రాముడిగా ఆర్ ఆర్ఆర్, లక్ష్మణుడిగా రామరాజు సేవలందించాలన్నారు. దాత దాట్ల సత్యనారాయణరాజు మాట్లాడుతూ తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం మంత్రిని సన్మానించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్డీవో ప్రవీణ్‌కుమార్, డీసీహెచ్ సూర్యనారాయణ, సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ అచ్యుత్ గణేష్, డాక్టర్ భువన, బిలాల్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాదు తదితరులు

చుక్కల ముగ్గులకే మహిళల ప్రాధాన్యం

పోడూరు, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): చుక్కల ముగ్గులకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని డీసీసీబీ మాజీ డైరెక్టర్ దేవళ్ల ప్రసాద్ అన్నారు. జిన్నూరు దేవళ్ల వారి వీధిలో ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానో త్సవ సభలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు రోజారమణి, మండల అధ్యక్షుడు సూర్యనారాయణరాజు, పాలకొల్లు డీసీ చైర్మెన్ రామభద్రరాజు, వైస్ చైర్మెన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, ఎంపీటీసీలు భూపతిరాజు సరస్వతి, విప్పర్తి శారద, మాజీ ఎంపీపీ దాసరి రత్న రాజు, మాజీ సర్పంచ్ పాలవలస తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



సేవలకు సత్కారం

భీమవరం అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): డీఎన్నార్ కళాశాల ఆడిటోరియంలో దివంగత గంగిపాముల రంగనాయకులు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు భాస్కర్-జ్యోతి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరంలో సేవలందించిన వారిని సేవాతత్పరులను సత్కరించారు. డీఎన్నార్ కళాశాల పాలకవర్గ కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షులు గోకరాజు పాండురంగరాజు, సూర్యమిత్ర ఎగ్జిమ్స్ అధినేత యిర్రింకి సూర్యారావులు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ గంగిపాముల భాస్కర్ శంకర్ నేత్రాలయ సహకారంతో 900 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 140 ఆపరేషన్లు నిర్వహించి ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. నిర్వాహకులు గంగిపాముల భాస్కర్ సహకారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, తన్నీరు మదన్‌బాబు, ఫిలిప్, కర్రి వేణు, కర్రి ప్రసాద్, జి.రమేష్‌బాబు, వంక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం



భీమవరం క్రైం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా కోడిపందాలు, పేకాట, జూదాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భీమవరం రూరల్ సిఐ జి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం భీమవరం మండలంలోని లోసరి, డేగాపురం గ్రామాల్లో బరులకు సిద్ధం చేస్తున్న బరులను సిఐతోపాటు ఎస్‌ఐ వీర్రాజు, భీమవరం తహసిల్దార్ ఆర్.రాంబాబులు జాయింట్ యాక్షన్ కమిటీగా వెళ్ళి ధ్వంసం చేయించారు. అలాగే సంక్రాంతి పండుగను ఆటలు, పాటలతో ఆనందంగా గడుపుకోవాలని, జూదాల జోలికి వెళ్ళి ఇబ్బందులు పడవద్దని తెలియజేశారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలోని కడియద్ద, పెదతాడేపల్లిలోని కోడిపందేల నిర్వహణకు వేసిన బరులను శనివారం ధ్వంసం చేశారు. బరుల నిర్వాహకులను బైండోవర్ చేశారు.

పాడి రైతులకు ప్రోత్సాహం : పితాని



ఆచంట/పెనుమంట్ర/పెనుగొండ, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అబివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం పెనుగొండలో గోకులం షెడ్‌ను ప్రారంభించారు. సర్పంచ్ నక్కా శ్యామ లా సోని శాస్త్రి, వేద వ్యాస శాస్త్రి, నానాజీ, వేంద్ర రాము, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఆచంట శివారు కోనపోతుగుంటలో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును శనివారం ఎమ్మెల్యే పితాని ప్రారంభించారు. ప్రభుత్వం రైతులకు పాడి పరిశ్రమకై మరిన్ని పథకాలు పెట్టడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ఎంపీపీ దిగుమర్తి సూర్యనారాయణ, ఎంపీడీవో వి. పూర్ణబాబ్జి తదితరులు పాల్గొన్నారు. పెనుమంట్ర మండలం నాగళ్ళ దిబ్బలో నిర్మించిన గోకులం షెడ్డును శనివారం పితాని ప్రారంభించి మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం 268 గోకులం షెడ్లు నిర్మిస్తే ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం 12 వేల 500 గోకులం షెడ్లు నిర్మించిందన్నారు. డీసీ చైర్మన్ బుల్లి రామిరెడ్డి, పాలమూరు నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చింతపల్లి రామకృష్ణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పెనుమత్స వివేక రాఘవేందర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం భేష్ : అంజిబాబు



భీమవరం టౌన్/వీరవాసరం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరం నియోజకవర్గ సుందరీకరణకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ చైర్మన్, ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. శ్రీ అన్నపూర్ణమ్మ అన్నదాన సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకుడు, విగ్రహ దాత తమిరి శరత్ సహకారంతో సుమారు రూ 2 లక్షలతో భీమవరం ఓవర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన స్వాగతం పలికే స్త్రీమూర్తుల విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. దాత శరత్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరింత సహకారం అందిస్తామని అన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వర రావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, విజ్జురోతి రాఘవులు, ట్రస్ట్ కార్యదర్శి చలపాక కృష్ణ భవానీ తదితరులు పాల్గొన్నారు. పల్లె పండుగతో రాష్ట్రంలో గత ఐదేళ్లు తీవ్ర నిర్లక్ష్యానికి గురైన గ్రామాల అభివృద్ధికి నేడు అడుగులు పడ్డాయని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. దిరుసుమర్రు, వీరవాసరం మండలం అండలూరులో పశువుల షెడ్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు.

పండుగలు సంప్రదాయానికి ప్రతిబింబం



బహుమతులందిస్తున్న కలెక్టర్, ఎస్పీలు


నరసాపురం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): పండుగులు సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబిస్తాయని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. పట్టణంలోని వలందర్ రేవులో బొమ్మిడి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి జిల్లా ఎస్పీ నయింతో కలిసి విజేతలకు బహుమతులందించారు. ఎస్పీ నయీం మాట్లాడుతూ పండుగ సమయాల్లో యువత వ్యవసనాలకు వైపు మళ్ళకుండా కుటుంబంతో ఆనందంగా గడపాలన్నారు. డీఎస్పీ శ్రీవేద, ఆర్డీవో దాసిరాజు, తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

ధర్మానికి మూలం వేదం



పాలకొల్లు అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం క్షీరారామేశ్వర వేద శాస్త్ర సమితి ఆధ్వర్యంలో వేద సభ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన గుళ్ళపల్లి విశ్వనాథ ఘనాపాఠి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వేదాలను కాపాడుకోవాలన్నారు. వేదమే ధర్మానికి మూలం అన్నారు. అనంతరం వేద పండితులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి శ్రీక్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం తరపున రూ. 15వేలు ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు అందజేశారు. వేద పండితులు గుళ్ళపల్లి శివ శర్మ ఘనాపాఠి, భమిడి రామకృష్ణావధాని, గుళ్ళపల్లి చిన్న ఆంజనేయ ఘనాపాఠి, లింగాల సత్యనారాయణావధానులు, మల్లాది రామకృష్ణ శర్మ, గుళ్ళపల్లి శ్రీనివాసావధాని, వెంపరాల సీతారామాంజనేయ అవధాని, ఆకెళ్ళ గంగాధర శర్మావధాని, గళ్ళపల్లి సుబ్రహ్మణ్యావధాని, విశ్రాంత సంస్కృత అధ్యాపకులు వికె సత్యనారాయణ, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలో ఓబన్న పాత్ర మరువలేనిది



భీమవరం టౌన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న పాత్ర మరువలేనిదని, తెలుగు వారి ఆత్మగౌరవం కోసం వడ్డె ఓబన్న ఎంతగానో పోరాడారని బార్ ఆసోసియేషన్ సభ్యులు ఉండపల్లి రమేష్ నాయుడు, క్విట్ ఇండియా పునః నిర్మాణ కమిటీ సభ్యుడు చెరుకువాడ రంగసాయి అన్నారు. భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద ఓబన్న జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన త్రపటా ని కి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రేనాటి వీరుడు ఓబన్న చరిత్ర నేటి తరాలకు తెలియజేయాలని, బ్రిటీష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరోచితంగా పోరాడిన ఓబన్న చిరస్మరణీయుడన్నారు.

త్వరలో నరసాపురం-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు : ఎంపీ కలిశెట్టి

నరసాపురం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): నరసాపురం - విశాఖ మధ్య ఎక్స్‌ప్రెస్ రైలు నేరుగా నడిపేందుకు రైల్వే మంత్రి అంగీకరించినట్లు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు చెప్పారు. శనివారం వైఎన్ కళాశాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ విషయమై తనతో పాటు మంత్రి శ్రీనివాసవర్మ రైల్వే మంత్రికి, బోర్డుకు తెలియజేశామన్నారు. ప్రస్తుతం మచిలీపట్నం నుంచి వస్తున్న రైలు భీమవరం మీదుగా విశాఖ వెళుతుందన్నారు. అయితే ఈ రైలు పై ప్రాంతం నుంచి రావడం వల్ల జిల్లా ప్రయాణికులకు సీట్లు దొరకడం లేదన్నారు. అందువల్ల కొత్త ఎక్స్‌ప్రెస్ వేయాలని కోరామన్నారు. అలాగే నరసాపురం నుంచి వారణాసి ఎక్స్‌ప్రెస్ వేయాలని, దీన్ని ఉత్తరాంధ్ర మీదుగా నడపాలని రైల్వే మంత్రిని కోరామన్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ చెప్పారు.

బండారుకు ప్రముఖుల పరామర్శ

నరసాపురం రూరల్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడ్ని శనివారం ఎంపీ అప్పలనాయుడు, హైకోర్టు రిటైర్డు న్యాయ మూర్తి గ్రంధి భవాని ప్రసాద్ పరామర్శించారు. ఆయన తండ్రి ప్రతాప్ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గుంటూరు డీఎంహెచ్‌వో చదలవాడ నాగేశ్వరరావు కూడా పరామర్శించారు.

కులగణన అభ్యంతరాలపై గడువు పొడిగించాలి

భీమవరం అర్బన్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): కులగణన అభ్యంతరాలపై తేదీని పొడిగించాలని, దళితపేటల్లో అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు డిమాండ్ చేశారు. శనివారం సమితి జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ కనీస అవగాహన లేనివారికి కులగణన బాధ్యతలు అప్పగించడం అన్యాయమన్నారు. గునుపూడి చందు, బత్తుల అజయ్, ఇంజేటి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవాల వేళ 2కె రన్

ఆకివీడు రూరల్ జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆకివీడు మండలం దుంప గడప లోని వివి గిరి ప్రభుత్వ కళాశాల 50 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం నిర్వహించనున్న స్వర్ణోత్సవాలు పురస్కరించుకుని 2కె రన్ నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రన్‌లో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవాలను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ సుజాత, డాక్టర్ ప్రతాప్‌కుమార్, తాడినాడ బాబు, గొంట్లా కృష్ణమూర్తి, రామ చెంచయ్య, కె. రాజరాజేశ్వరి, బి ప్రసన్నదుర్గ, కె వాసు, ఎం. పెద్దిరాజు, సీతారామరాజు, గుర్రం సత్య నారాయణ, బి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు చేయూత

ఆచంట, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి అండగా నిలిచారు పూర్వ విద్యార్థులు. పోడూరు మండలం వద్దిపర్రు కు చెందిన ములగబేటి చిరంజీవి ఇల్లు ఇటీవల దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఆచంట ఎంవీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్న చిరంజీవికి తమ వంతు సహాయంగా రూ.18 వేలు విలువ గల 60 సిమ్మెంటు బస్తాలు శనివారం అందించారు. ఈ సందర్భంగా బాదిత కుటుంబం, గ్రామస్థులు పూర్వ విద్యార్థులను అభినందించారు.

అపూర్వ కలయిక



యలమంచిలిలో విద్యార్థుల ఆత్మీయ కలయిక

యలమంచిలి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూలులో 1990-91 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఆత్మీయంగా అప్పటి నిక్ నేమ్‌లతో పలకరించుకుంటూ ఆడి, పాడి సందడి చేశారు. తమకు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కుడుపూడి సత్య, తాళ్లూరి వెంకటేశ్వరరావు, గుబ్బల శ్రీను, తమ్మినీడి గోపాలకృష్ణ, దాసరి వాసు, మల్లుల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: స్థానిక పూడి లాజర్ కృపావరం (పిఎల్‌కె) హైస్కూల్లో 1988-89 సంవత్సరం 10వ తరగతి పూర్వవిద్యార్థులు శనివారం పాఠశాలలో కలిసి సందడి చేసారు. పూర్వవిద్యార్థి సంఘ నాయకుడు సనమండ మోరి బాబు మాట్లాడుతూ ఈపాఠశాలలో చదివిన వారు ఎంతో మంది ఉన్నత స్థానాలకు చేరుకున్నారని తెలిపారు. ఈసందర్భంగా తమ పూర్వ ఉపాధ్యాయులు రాణి విశ్వనాధం, విశ్వేశ్వరరావులు ఘనంగా సత్కరించారు. తమతమ జీవితాలు, అప్పుడు చేసినఅల్లర్లను తలచుకుని కుటుంబ సభ్యుల వివరాలను ఒకరికొకరు పంచుకున్నారు.



పీఎల్‌కేలో విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం